


కల్కిగా కలియుగనాథుడు

● నేటి చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో బుధవారం కలియుగనాథుడైన శ్రీవేంకటేశ్వరస్వామి గుర్రమెక్కి కల్కిగా దర్శనమిచ్చారు. రాత్రి జరిగిన అశ్వవాహనంపై సెంటు జాజి, మల్లి, కనకాంబరం, కురువేరు మాలలను ధరించి మాడవీధుల్లో ఊరేగి దర్శనమిచ్చారు మలయప్ప. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, జీయంగార్ల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ చివరివాహనమైన అశ్వవాహనం కోలాహలంగా జరిగింది. దీంతో వాహన సేవలు ముగిశాయి. కాగా, ఉదయం మహారథంపై అమ్మవార్ల సమేతంగా శ్రీవారు ఊరేగారు. గురువారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మహిషాసుర మర్దినిగా బోయకొండ గంగమ్మ



చిత్తూరు గిరింపేటలో బుధవారం రాత్రి విజయలక్ష్మి అలంకారంలో పుష్పపల్లకిలో ఊరేగిన దుర్గమ్మ

చౌడేపల్లె,అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): బోయకొండలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో బుధవారం గంగమ్మ మహిషాసురమర్ధినీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. రెండు చేతుల్లో శంఖుచక్రాలు, మరో రెండు చేతుల్లో విల్లంబులు, ఓ చేతిలో ఖడ్గం, మరో చేతిలో డాలు, ఇంకో రెండు చేతుల్లో త్రిశూలంతో గంగమ్మను అలంకరించి, సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. నల్లని రుద్ర రూపంతో మహిషాసుర మర్ధినీదేవిగా అలంకరించి ధూపదీప, నైవేద్యం సమర్పించారు.



పింఛన్ల పంపిణీ 94.88 శాతం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ తొలిరోజైన బుధవారం 94.88శాతం జరిగింది. జిల్లావ్యాప్తంగా 2,68,307మంది పెన్షనర్లకుగానూ 2,54,571 మందికి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేశారు. గురువారం సెలవుదినం కావడంతో, మిగిలిన 13,736 మందికి శుక్రవారం అందజేయనున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ సాధారణంగా ఉదయం 6.30 గంటల నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా సచివాలయాల సిబ్బంది నిరసన కారణంగా పలు చోట్ల ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైంది. దీంతో రాత్రి 7 గంటల సమయానికి 94.88శాతం పింఛన్లను సిబ్బంది పంపిణీ చేయగలిగారు.

అనుమతులొచ్చేశాయ్!

మంగసముద్రం, బైరుగానిపల్లెల్లో కేవీల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం

చిత్తూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఇప్పటికే కేంద్రీయ విద్యాలయాలు మంజూరైన విషయం, సంబంధిత అధికారులు స్థల పరిశీలన చేసిన విషయం తెలిసిందే. వైసీపీ పాలనలో జిల్లాల పునర్విభజన జరిగాక చిత్తూరు జిల్లాలో చెప్పుకోదగ్గ విద్యా సంస్థ ఒక్కటీ లేకుండా పోయింది.ఈ నేపథ్యంలో చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు ఒక్కోటి చొప్పున కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి. అన్నమయ్య జిల్లాలో మరుసటి సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమయ్యాయి. చిత్తూరులో మాత్రం సరైన భూమి చూపించడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం, శ్రద్ధ లోపించింది. దీంతో చిత్తూరులో విద్యాలయం ప్రారంభానికి నోచుకోలేదు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శ్రద్ధ తీసుకుని కేంద్రీయ విద్యాలయ సత్సంగ్ కమిషనర్‌కు లేఖలు రాశారు. చిత్తూరుతో పాటు సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోనూ కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసింది. ఈ క్రమంలోనే గతేడాది కేంద్రీయ విద్యాలయ సత్సంగ్ బృందం చిత్తూరు, కుప్పం ప్రాంతాల్లో స్థల పరిశీలన చేసి వెళ్లింది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంగసముద్రం, కుప్పం మండలంలోని బైరుగానిపల్లెలో కేంద్రీయ విద్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలాల్ని కేటాయించింది. తాజాగా ఈ రెండు ప్రాంతాల్లో కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు బుధవారం నిర్వహించిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడంతో ప్రధాని మోదీకి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రకు సీఎం చంద్రబాబు సామాజిక మాధ్యమాల్లో కృతజ్ఞతలు తెలిపారు.కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం రావడంపై గురువారం టీడీపీ నేతలు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఎమ్మెల్యే జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరులో సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే,టీడీపీ నేతలు

జీఎస్టీ తగ్గింపుతో రైతుకు మరింత లాభం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు.బుధవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో జీఎస్టీ సూపర్ సేవింగ్ ద్వారా వ్యవసాయ రంగంలో కలిగే ప్రయోజనాలపై రైతాంగానికి అవగాహన కార్యక్రమం కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు తదితరాల ధరలు తగ్గుతాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపును రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు అన్ని వర్గాలవారికీ ఊరట ఇచ్చిందన్నారు.వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పట్టు , పశుసంవర్ధక శాఖలతో పాటు, ఏపీఎంఐపీ ఇతర అనుబంధ విభాగాలు కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పనిముట్లు, పరికరాల ప్రదర్శనను వారంతా సందర్శించారు.జేసీ విద్యాధరి,మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, వ్యవసాయ, పశుసంవర్ధక,పట్టు పరిశ్రమ శాఖల జేడీలు మురళీకృష్ణ, ఉమామహేశ్వరి, పద్మావతి, మత్స్య శాఖ ఏడీ రవికుమార్, ఉద్యానశాఖ డీడీ మధుసూదన రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ రమణ, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ రఘునాథరెడ్డి, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న ఎంపీ, కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యేలు, తదితరులు

గ్యాంగ్ రేప్ విచారణ వేగవంతం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలానికి చెందిన బాలికపై అత్యాచార ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ వేగవంతం చేశారు.గత నెల 25వ తేది మురకంబట్టు సమీపంలోని అటవీశాఖ నగరవనంలో ఇంటర్ విద్యార్థినిపై ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.ఈ దారుణానికి పాల్పడిన మంగసముద్రం దళితవాడకు చెందిన హేమంత్, మురకంబట్టు అగ్రహారానికి చెందిన కిశోర్, మహేష్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు సమాచారం. వీరు కొంతకాలంగా ఒంటరిగా పార్కుకు వచ్చే వారిని బెదిరించి నగలు, నగదును దోచుకెళ్లేవారని తెలిసింది. నిందితుల ఫోన్లను స్వాధీనం చేసుకుని ఆ ఫోన్లలో ఉన్న వివరాలను సేకరించే పనిలో పోలీసులున్నారు. బుధవారం ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలం వద్ద ఆధారాలు సేకరించారు. గతంలో ఎవరిపైన అయినా ఇలాంటి అఘాయిత్యాలకు నిందితులు పాల్పడ్డారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. నిందితులను గురువారం అరెస్టు చూపే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కాగా తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో సీతమ్స్, అపోలో ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి.పెద్ద సంఖ్యలో విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పోలీసు స్టేషన్ పరిధిలో 27మంది పని చేస్తున్నప్పటికీ వారిలో 14 మంది వివిధ చోట్ల విధులు నిర్వహిస్తున్నారు.మిగిలిన 13మందితోనే విధుల నిర్వహణ కష్టంగా ఉందని పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరోగ్య కేంద్రాలపై కలెక్టర్ దృష్టి

యాదమరి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం పర్యటించారు. పింఛన్ల పంపిణీ, అంతరాష్ట్ర రహదారి, ఆరోగ్య కేంద్రాల పనితీరును పరిశీలించారు. కాశిరాల గ్రామంలో గతంలో వెంకటస్వామి అనే లబ్ధిదారుడికి నెలకు రూ.15 వేలు పింఛన్ వస్తుండగా, రీ-అసెస్మెంట్ (పునఃపరిశీలన)లో భాగంగా దానిని రూ.4 వేల వృద్ధాప్య పింఛన్‌గా మార్చారు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురించడంతో కలెక్టర్ స్వయంగా వెంకటస్వామి ఇంటికి వెళ్లి ఆయనకు పింఛన్ అందించారు. ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ కాశిరాల గ్రామంలోని ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రక్తపోటు పరీక్ష పరికరం సరిగా పనిచేయకపోవడం గమనించి అక్కడి సిబ్బందిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మాదిరెడ్డిపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ పీహెచ్‌సీలోని ఓ భవనం శిథిలావస్థలో ఉండడంతో నూతన భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటివారిపల్లె పంచాయతీ యానాదికాలనీలో మౌలిక వసతుల కల్పనకు చేపట్టవలసిన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ పార్థసారథి, డిప్యూటీ ఎంపీడీవో రామచంద్ర, డాక్టర్ వరప్రసాద్, టీడీపీ అధికార ప్రతినిధి అమరనాథ నాయుడు పాల్గొన్నారు.


కాశిరాలలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ తదితరులు

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి: టీడీపీ

చిత్తూరు సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని పార్టీలకతీతంగా కఠినంగా శిక్షించాలని టీడీపీ చిత్తూరు పార్లమెంటు తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ బాలికపై అత్యాచారానికి పాల్పడింది టీడీపీ వారని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిందన్నారు. నిందితులు వినాయక చవితి ఉత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించడానికి వచ్చినపుడు తీసుకున్న ఫొటోలను పెట్టి అసత్యప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించిందన్నారు. వైసీపీ నిర్వహించిన కార్యక్రమాల్లో నిందితులు చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ విజయానంద రెడ్డితో కలసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న ఫొటోలు బయటకు రావడంతో వారికి నోట మాట రాలేదన్నారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ పాల్గొన్నారు.బాలికపై అత్యాచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చుడా చైర్ పర్సన్ కటారి హేమలత, తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు.


మీడియా సమావేశంలో అరుణ,సీఆర్ రాజన్

కేజీబీవీల్లో సీసీ కెమెరాలతో మరింత భద్రత

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో భద్రత పెంచనున్నట్లు ఏపీసీ వెంకటరమణ తెలిపారు. జిల్లాలోని ఎనిమిది కేజీబీవీల్లో నిఘా పెంచడానికి సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పాత బిల్లులకు మోక్షం

● రూ.7.82 కోట్లు విడుదల

చిత్తూరు రూరల్, అక్టోబరు 1(ఆంధ్ర జ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో వివిధ గ్రాంట్లకు సంబంధించి 2018-19 నడుమ చేసిన పనులకు సంబంధించిన బిల్లులకు మోక్షం లభించింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ బిల్లులను మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురైన విషయం తెలిసిందే. అయితే ఇన్నాళ్లకు మళ్లీ కూటమి ప్రభుత్వంలోనే ఆ బిల్లులకు మోక్షం లభించింది. రూ.5 లక్షల లోపున్న సుమారు 372 పనులకు సంబంధించి రూ.7,82,63,253 నిధులను బుధవారం ప్రభుత్వం విడుదల చేసిందని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. దసరా కానుకగా బిల్లులు మంజూ రు చేశారంటూ సీఎం చంద్రబాబుకు కాంట్రాక్టర్లు, సర్పంచులు, టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అప్పటి బిల్లులతో పాటుప్రస్తుతం చేసిన రూ.5 లక్షల లోపు పనులకు సంబంధించిన బిల్లులనూ ప్రభుత్వం విడుదల చేసింది. ఆ మొత్తాన్ని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఎంపీడీవోల ఖాతాలకు జమచేయడం జరిగిందని, పనులు చేసిన వారు వారిని సంప్రదించాలని జడ్పీ సీఈవో తెలిపారు.

కూల్‌డ్రింక్ అనుకుని తాగితే విషమైంది

నాలుగేళ్ల బాలిక మృతి -అస్వస్థత పాలైన ఆమె సోదరుడు

పుంగనూరు రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్ అనుకుని తాగిన ద్రవం నాలుగేళ్ల బాలిక ప్రాణం తీసింది. పుంగనూరు పట్టణ సమీపంలోని కంపోస్టుయార్డు వద్ద నివాసమున్న సుబ్రహ్మణ్యం కుమారుడు సుభాష్(8), కుమార్తె జయశ్రీ(4) బుధవారం చెత్తలో పడివున్న ఓ బాటిల్‌ను కూల్‌డ్రింక్ అనుకుని తాగారు. కాసేపటికే జయశ్రీ, సుభాష్‌లు తీవ్ర అస్వస్థతకు గురవడంతో తల్లిదండ్రులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే జయశ్రీ మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. సుభాష్‌కు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


మృతురాలు జయశ్రీ

గంజాయి విక్రేత అరెస్ట్

పుంగనూరు రూరల్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పుంగనూరు మండలం కొత్తపేటకు చెందిన రేవంత్ మార్కెట్ యార్డు వద్ద గంజాయి విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకున్నారు. 1.50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన



చిత్తూరు రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరి వీడాలని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారి సమస్యలు పరిష్కరించాలని స్థానిక గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యాధి కారులు 25 ఏళ్లుగా టైమ్ బౌండ్ ప్రమోషన్లు లభించకపోవడంతో దారుణమన్నారు. పొరుగు రాష్ట్రాలన్నిటి లోనూ అమలవుతున్నా ఇక్కడ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇటీవల ఏపీవీ వీపీలో మూడు సంవత్సరాల అనుభవం ఉన్న సీఏఎస్‌లకు ప్రమోషన్లు ఇచ్చారన్నారు. అయితే 25 ఏళ్లుగా సేవలందిస్తున్న డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో పీహెచ్‌సీ వైద్యులు మాత్రం ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తూ సీఏఎస్‌గానే రిటైర్ అవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. అలాగే జీవో 99 ద్వారా ఇన్‌సర్వీస్ కోటా కేవలం 15 శాతం తగ్గించి, అది కూడా 6 విభాగాలకు మాత్రమే పరిమితం చేయడాన్ని ఖండిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శిరీషా, వైద్యాధికారులు మునికుమార్, చంద్రమహేష్, విజయలక్ష్మి, హరినాథ్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి



విజయపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో బస్సు ఢీకొని ఒక వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ మహేష్‌బాబు కథనం మేరకు.. నాగలాపురం నుంచి తిరుత్తణి వైపుగా వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు ఆమగుంట వద్ద బస్సుకోసం నిలబడి ఉన్న ఆమగుంటకు చెందిన రాజయ్య(80)ను ఢీకొంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో తిరుపతి రుయాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధార్మిక, సామాజిక విలువలకు ప్రతీక విజయదశమి: ఎస్పీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):ధార్మిక, సామాజిక విలువలకు ప్రతీకగా విజయదశమి పండుగను ఎస్పీ తుషార్ డూడీ అభివర్ణించారు.జిల్లా ప్రజలకు, పోలీసు కుటుంబ సభ్యులకు ఆయన ఒక ప్రకటనలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచితనం విజయం సాధించడానికి గుర్తయిన విజయదశమి పర్వదినంలో కుటుంబ సభ్యులను గౌరవించడం, సాంప్రదాయాలను పాటించడం, సమాజంలో ఐక్యతను పెంపొందించడం వంటివి భాగాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.

తిరుపతి వేదికగా 8, 9 తేదీల్లో సహకార జాతీయ సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సహకారరంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి ఈనెల 8, 9 తేదీల్లో తిరుపతిలోని హోటల్ తాజ్ వేదికగా జాతీయస్థాయి సదస్సు జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యమిచ్చే ఈ సదస్సుకు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్, అడిషనల్ చీఫ్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్‌తో పాటుసహకార శాఖ కార్యదర్శులు, సహకార సంఘ రిజిస్ట్రార్లు, కేంద్రం, వివిధ రాష్ట్రాల్లోని సహకార రంగాలకు చెందిన అధికారులు, ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ నెల 7న డెలిగేట్లు తిరుపతికి చేరుకోనున్నారు. ఈ సదస్సు కోసం కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు.

శిక్షణా కాలంలో పూర్తిగా ఉంటేనే పోస్టింగ్

● కొత్త ఉపాధ్యాయులకు విద్యాశాఖ సూచన

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ద్వారా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు శిక్షణా కాలంలో పూర్తిగా ఉంటేనే పోస్టింగ్ ఆర్డర్స్ ఇస్తామని డీఈవో వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు చిత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో నిర్ణయించిన కేంద్రాల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లుతెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు అభ్యర్థులు తప్పనిసరిగా వారి కేటాయించిన శిక్షణా కేంద్రాల్లో హాజరు కావాలని స్పష్టంచేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అపాంట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు లేటెస్టు ఆండ్రాయిడ్ ఫోన్ తీసుకురావాలని సూచించారు.

నౌకా నిర్మాణ కేంద్రానికి స్థల పరిశీలన

వాకాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లా వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించనున్న నౌకా నిర్మాణ కేంద్రానికి అవసరమైన భూములను సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన ఆధ్వర్యంలో కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటు చేయనున్న భూముల మ్యాప్‌ను పరిశీలించారు. పూర్తి వివరాలతో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నట్లు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్, డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా రథోత్సవం


తీర్థంలో రథోత్సవంలో రామచంద్రస్వామి

బైరెడ్డిపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామంలో రామచంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు రమేష్‌ఆచార్యులు సీతా లక్ష్మణసమేత రామచంద్రస్వామి ఉత్సవ మూర్తులకు విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథంపై కొలువుదీర్చి మేళతాళాలు, శ్రీరామనామస్మరణల మధ్య భక్తులు రథాన్ని లాగారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కు లు చెల్లించుకున్నారు. బైరెడ్డిపల్లె తహసీల్దార్ ప్రసన్నకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.








సత్యగంగమ్మ

మహిషాసురమర్దినిగా సత్యగంగమ్మ

పలమనేరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని సత్యగంగమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు. ● **వి.కోట:** వి.కోటలో వెలసిన దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం మహిసాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు భాస్కర్‌శర్మ అమ్మవారి విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.


దుర్గమ్మ

● **సోమల:** సోమల మండలంలోని కందూరు పాలేటమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయం, పత్రపల్లె, సోమల బోయకొండ గంగమ్మ, సోమల గీతా ఆశ్రమంలో అమ్మవార్లకు అభిషేకపూజలు చేశారు.


కందూరు పాలేటమ్మ.

ఘనంగా దసరా ఉత్సవాలు

రామకుప్పం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కంబాల దేవులపల్లెలోని సప్తమాతృక సహిత చౌడేశ్వరి అమ్మవారు రామకుప్పం, అనిగానూరులోని కన్యాకా పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ● **బైరెడ్డిపల్లె:** దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం మండలంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. బైరెడ్డిపల్లె బాట గంగమ్మ ఆలయం, సల్లాపురెమ్మ ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, గడూరు సల్లాపురెమ్మ ఆలయం, కొత్రేపల్లె గంగమ్మ ఆలయంలో పూజలు జరిగాయి.


రామకుప్పం: వాసవీ కన్యాకా పరమేశ్వరి

సేవింతురే!

దేవుడికి మెట్టుగా మారిన కులశేఖరుడు



తిరుమల గర్భాలయం ముందుండే మెట్టుని కులశేఖర పడి అంటారు. కులశేఖరుడనే పరమ భక్తుడి కోరికను శ్రీనివాసుడు మన్నించడంతో ఈ మెట్టు ఏర్పడిందంటారు. 12 మంది ఆళ్వారులలో 7వ ఆళ్వారు కులశేఖరుడు. క్రీ.శ.725 కాలానికి చెందిన చేర వంశపు రాజు ఇతను. మహా వేదాంతి. విష్ణు భక్తుడు. శ్రీరాముడి ఆరాధకుడు. పురాణ ఘట్టాలు వింటూ ఆ పాత్రల్లో లీనమైపోయేవాడు. తనే ఆ పాత్రనని ఊహించుకునేవాడు. రాజ్యభోగాలను త్యజించి శ్రీరంగంలో పరివ్రాజకుడిగా జీవితాన్ని గడిపాడు. శ్రీవేంకటేశ్వరిడిలో ఐక్యం కావాలనే వాంఛతో ఉండేవాడు. పదకొండు పాశురాలతో స్వామిని కీర్తించాడు. ఈ క్షత్రియ జన్మ నాకు వద్దు. నీ పుష్కరిణిలో వాలే నీటికొంగనై పుట్టినా చాలు.. ఈ కొండవాగుల్లో ఈదే చేపపిల్లగా నైనా పుట్టించు స్వామీ అని వేడుకునేవాడు. కనీసం నీ గర్భాలయంలో తొలి మెట్టుగా అయినా ఉండనీ అని ఆయన చేసిన ప్రార్థనను మన్నించి స్వామి తథాస్తు అన్నాడని, ఆయనే మెట్టుగా మారడంతో కులశేఖర పడిగా అది ప్రసిద్ధి చెందిందని చెబుతారు. సంస్కృతంలో ఈయన 'ముకుందమాల' అనే స్తోత్రాన్ని రచించాడు.

- చిత్రం: సాగర్ గిన్నె



మహారథంపై మహామూర్తి







శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహారథోత్సవం నేత్రపర్వంగా సాగింది. భక్తిశ్రద్ధలతో భక్తులు రథాన్ని తాళ్లతో లాగగా.. భారీ బరువైన మహారథం చకచకా ముందుకు కదిలింది. రెండు గంటల్లోనే మహారథోత్సవం ముగిసింది. మహారథంలోని శ్రీభూ సమేత మలయప్పస్వామిని దర్శించుకుని భక్తులు ఆనందపరవశులయ్యారు. మహారథానికి భారీగా హాజరైన భక్తులు రాత్రి అశ్వవాహనంలోనూ పాల్గొనడంతో మాడవీధులు భక్తులతో కళకళలాడాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







రథాన్ని లాగుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు







నయనానందకరంగా నృత్య ప్రదర్శనలు

బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి శ్రీవారి అశ్వవాహన సేవలో నృత్యప్రదర్శనలు నయనానందకరంగా సాగాయి. తొమ్మిది రాష్ట్రాల నుంచి వచ్చిన 21 బృందాల్లోని 539 మంది కళాకారులు తమ ప్రదర్శన ద్వారా భారతీయ సాంస్కృతిక సమైక్యతను చాటి చెప్పారు. అశ్వారూఢనం, కలియుగ వేంకటేశ్వర వైభవం, మోహినీ ఘట్టం, శాస్త్రీయ నృత్యాలు, గౌడీయ నృత్యం, కథక్ నృత్యాలు అలరించాయి. ఆండాల్ పాశురాలు వంటి రూపకాలు, జగన్నాథ రథయాత్ర ఉత్సవ నేపథ్య ప్రదర్శనలు భక్తిపారవశ్యాన్ని కలిగించాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠంక్యూకాంప్లెక్స్1లో 5కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులువేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,275

తలనీలాలు సమర్పించినవారు: 21,973

అశ్వవాహన సేవలో..

బుధవారం రాత్రి జరిగిన అశ్వవాహనసేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజశేఖర్‌రావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి పాల్గొన్నారు. వాహనసేవ ప్రారంభ సమయంలో వీరు మలయప్పను దర్శించుకున్నారు.



ఆలయం వద్ద జస్టిస్ రాజశేఖర్‌రావు, జస్టిస్ చక్రవర్తి

దుర్గమ్మకు టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల(కల్చరల్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు బుధవారం టీటీడీ తరఫున పట్టువస్త్రాలను పాలక మండలి సభ్యులు సుచిత్ర ఎల్లా, నన్నపనేని సదాశివరావు, టి.జానకిదేవి, ఎ.రంగశ్రీ సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ - శివాణి నగరం

తిరుమల, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, సినీ నటి శివాణి నగరం దర్శించుకున్నారు. 'లిటిల్ హార్ట్స్‌ను ఆదరించిన అందరికీ ధన్యవాదాలు. త్వరలో 'హే భగవాన్' చిత్రం విడుదల కానుంది' అని శివాణి తెలిపారు.

కారు బోల్తా పడి వెదురుకుప్పంవాసి మృతి



మృతి చెందిన మురళి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ చిగురువాడ సమీపాన కారు బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు..చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం కిచ్చమామానాయుడుపల్లికి చెందిన కంకలపాటి మురళి(44) కుటుంబం తిరుపతిలోని ఉంటోంది. ఇతడికి ఇద్దరు పిల్లలు. కార్వేటినగరంలో కిరాణా షాపు ఉంది. రోజూ పనులు ముగించుకుని కారులో తిరుపతికి వచ్చి వెళ్లే వారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తిరుపతికి వస్తుండగా చిగురువాడ వద్ద స్వర్ణముఖి నది బ్రిడ్జిపై వంతెన దాటే సమయంలో టైరు పంక్చరై కారు బోల్తా పడింది. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని రుయాకు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ షావలి కేసు నమోదు చేశారు.

రోజంతా పవిత్ర ఘడియలే

- ఎప్పుడైనా పుష్కరణ స్నానం చేయొచ్చన్న ఈవో



పుష్కరిణి వద్ద ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఏకే సింఘాల్

తిరుమల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): 'గురువారమంతా పవిత్ర ఘడియలే. ఎప్పుడైనా శ్రీవారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించొచ్చు. భక్తులు సంయమనంతో వ్యవహరించాలి'అని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సూచించారు. గురువారం ఉదయం జరిగే చక్రస్నానానికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఆయన జేఈవో వి.వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. వెయ్యి మంది పోలీసులు, 1300 మంది టీటీడీ విజిలెన్స్‌తో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. ఈతగాళ్లు, బోటును అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కాగా, ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వరాహస్వామి ఆలయం వద్ద పుష్కరిణిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనాన్ని నిర్వహిస్తారు. ఆ తర్వాత చక్రత్తాళ్వారు సహా అర్చకులు మూడు మునకలు వేసి చక్రస్నానం ముగుస్తుంది. భక్తుల కోసం పుష్కరిణిలో గ్యాలరీలు, స్నానఘట్టాలు ఏర్పాటు చేశారు.

ఆల్ ది బెస్ట్

- అంకితభావంతో పని చేయండి
- కొత్త టీచర్లకు ఎమ్మెల్యే సన్మానం



ఎంపికైన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే

పుత్తూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గం నుంచి డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారికి ఆల్‌ది బెస్ట్ చెబుతూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సన్మానించారు. గౌరవప్రదమైన వృత్తిలో ప్రవేశిస్తున్న వాళ్లందరూ అంకిత భావంతో పనిచేయాలని కోరారు. నియోజకవర్గంలోని 109 మంది ఉపాధ్యాయులను కుటుంబాల సహా బుధవారం పుత్తూరులో ఆయన సన్మానించారు. తానూ ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చానని గుర్తు చేశారు. మెగా డీఎస్సీని నిర్వహించి ఎన్నికల వాగ్దానాన్ని తమ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. టీడీపీ నాయకులు గణేష్, యుగంధర్, ఏలుమలై, షణ్ముగం రెడ్డి, భాస్కరరెడ్డి, జనసేన నాయకుడు మహేష్, డీవైఈవో మహేష్, మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ, ఐదు మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి మృతి



మృతిచెందిన రఘు

పాకాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువు హైస్కూల్ గేట్ సమీపాన బుధవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు ఢీకొని మొగరాల పంచాయతీ కృష్ణాపురం దళితవాడకు చెందిన ఐ.రఘు (63) మృతిచెందారు. ఈయన రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి పీలేరు వెళ్తున్నఆర్టీసీ బస్సు ఢీకొంది. సీఐ సుదర్శన ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27న నిధి ఆప్‌కే నికత్

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రతి నెలా 27వ తేదీన నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తిరుపతి ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లు, చందాదారులకు నిరంతరం అందుబాటులో ఉండాలనే లక్ష్యంలో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కడప ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ కమిషనర్ సి.రవితేజకుమార్‌రెడ్డి, తిరుపతి ప్రావిడెంట్ ఫండ్ సంస్థ సహాయ కమిషనర్ పి.వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

5న బెంగళూరు, హైదరాబాదుకు అదనపు సర్వీసులు

తిరుపతి(ఆర్టీసీ),అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులనంతరం తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం ఈనెల 5న బెంగళూరుకు 20, హైదరాబాదుకు 5 బస్సులు అదనంగా నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు డిప్యూటీ సీటీఎం విశ్వనాథం ఆన్‌లైన్ బుకింగ్ ఓపెన్ చేయించారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర మహిళా ముఠా!

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో వినియోగదారులను బురిడీ కొట్టించి బంగారు నగలు, మొబైల్ ఫోన్లు అపహరించే అంతర్రాష్ట్ర మహిళా ముఠాను బుధవారం తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. పోలీసు అధికారులకు అందిన సమాచారం మేరకు తిరుపతి ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో మఫ్టీలో పోలీసుల బృందాలతో నిఘా ఉంచారు. ఆర్టీసీ బస్టాండులో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న దాదాపు నలుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ప్రయాణికులు బస్సు ఎక్కే సమయంలో రద్దీచూసి బంగారు నగలు, మొబైల్ ఫోన్లు కొట్టేస్తున్నారు. ఇప్పటి వరకు నెల్లూరు, విజయవాడ, తిరుపతి, కడప, ఒంగోలు వంటి ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు..అలిపిరి పరిధిలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన కె.లోకేష్(20) బీ-టెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. నగరానికి చెందిన ఓ యువతి ప్రేమలో పడ్డాడు. కొంత కాలంగా వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. లోకేష్ తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

ఏడుగురు నిందితుల అరెస్టు ● 241 గ్రాముల బంగారు, 1.5 కిలోల వెండి వస్తువులు స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, వెండి వస్తువులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురిని తిరుచానూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎంఆర్‌పల్లె పోలీసు స్టేషన్‌లో బుధవారం ఈ వివరాలను అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి మీడియాకు వెల్లడించారు. 'పశ్చిమగోదావరి జిల్లా లక్కవరానికి చెందిన తోట శివకుమార్, తోట వరలక్ష్మి, వెంకటేష్(తిరుపతి), అజీజ్(కడప), దేవి(రైల్వే కోడూరు మండలం మాధవరంపాడు), గాయత్రిదేవి(అనకాపల్లి), రాధాకృష్ణ(అశ్వరావుపేట) ముఠాగా ఏర్పడ్డారు. తిరుపతి, కడప, చుట్టు పక్కల జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. పగటిపూట తాళాలు వేసున్న ఇళ్లను గమనించి.. రాత్రికి దొంగతనం చేసేవారు. ఇలా సెప్టెంబరు10న అర్ధరాత్రి దాటాక మంగళం తుడా క్వార్టర్సులో గోవిందరాజులు ఇంటి తాళం పగుల కొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. డీఎస్పీ ప్రసాద్ నేతృత్వంలో సీఐ సునీల్‌కుమార్, ఎస్‌ఐలు జగన్నాథ రెడ్డి, అరుణ, సాయినాథ చౌదరి, సిబ్బంది బృందాలుగా పాత నేరస్తుల కోసం సాంకేతిక ఆధారాలతో గాలించి నిందితులను గుర్తించారు. బుధవారం మంగళం ఆర్టీవో కార్యాలయ సమీపంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. 241 గ్రాముల బంగారు నగలు, 1.5 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు' అని ఏఎస్పీ వివరించారు. వీరిపై కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట

- ప్రత్యామ్నాయంగా ఎస్వీఎంసీ వైద్యులతో విధులు



తిరుపతి(వైద్యం), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీపీహెచ్‌సీడీఏ ఆధ్వర్యంలో జిల్లాలోని 58 పీహెచ్‌సీల పరిధిలోని వైద్యులు బుధవారం సమ్మెబాట పట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 20 శాతం సర్వీసు, పీజీ రిజర్వేషన్‌ను అన్ని బ్రాంచులకు వర్తింపజేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని, పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవులకు జాబ్‌చార్ట్ అమలు చేయాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం నేత హరికృష్ణ కోరారు. వీటిని నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ క్రమంలో రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఎస్వీ వైద్య కళాశాల నుంచి 58 మంది వైద్యులను పీహెచ్‌సీలకు పంపినట్లు డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ తెలిపారు. సమ్మె ముగిసే వరకు వీరు విధుల్లో ఉంటారన్నారు.

ఆరోగ్య కేంద్రాలపై కలెక్టర్ దృష్టి


కాశిరాలలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ తదితరులు

యాదమరి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం పర్యటించారు. పింఛన్ల పంపిణీ, అంతరాష్ట్ర రహదారి, ఆరోగ్య కేంద్రాల పనితీరును పరిశీలించారు. కాశిరాల గ్రామంలో గతంలో వెంకటస్వామి అనే లబ్ధిదారుడికి నెలకు రూ.15 వేలు పింఛన్ వస్తుండగా, రీ-అసెస్మెంట్ (పునఃపరిశీలన)లో భాగంగా దానిని రూ.4 వేల వృద్ధాప్య పింఛన్‌గా మార్చారు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురించడంతో కలెక్టర్ స్వయంగా వెంకటస్వామి ఇంటికి వెళ్లి ఆయనకు పింఛన్ అందించారు. ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ కాశిరాల గ్రామంలోని ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రక్తపోటు పరీక్ష పరికరం సరిగా పనిచేయకపోవడం గమనించి అక్కడి సిబ్బందిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మాదిరెడ్డిపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ పీహెచ్‌సీలోని ఓ భవనం శిథిలావస్థలో ఉండడంతో నూతన భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటివారిపల్లె పంచాయతీ యానాదికాలనీలో మౌలిక వసతుల కల్పనకు చేపట్టవలసిన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ పార్థసారథి, డిప్యూటీ ఎంపీడీవో రామచంద్ర, డాక్టర్ వరప్రసాద్, టీడీపీ అధికార ప్రతినిధి అమరనాథ నాయుడు పాల్గొన్నారు.

పాత బిల్లులకు మోక్షం

● రూ.7.82 కోట్లు విడుదల

చిత్తూరు రూరల్, అక్టోబరు 1(ఆంధ్ర జ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో వివిధ గ్రాంట్లకు సంబంధించి 2018-19 నడుమ చేసిన పనులకు సంబంధించిన బిల్లులకు మోక్షం లభించింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ బిల్లులను మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురైన విషయం తెలిసిందే. అయితే ఇన్నాళ్లకు మళ్లీ కూటమి ప్రభుత్వంలోనే ఆ బిల్లులకు మోక్షం లభించింది. రూ.5 లక్షల లోపున్న సుమారు 372 పనులకు సంబంధించి రూ.7,82,63,253 నిధులను బుధవారం ప్రభుత్వం విడుదల చేసిందని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. దసరా కానుకగా బిల్లులు మంజూ రు చేశారంటూ సీఎం చంద్రబాబుకు కాంట్రాక్టర్లు, సర్పంచులు, టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అప్పటి బిల్లులతో పాటుప్రస్తుతం చేసిన రూ.5 లక్షల లోపు పనులకు సంబంధించిన బిల్లులనూ ప్రభుత్వం విడుదల చేసింది. ఆ మొత్తాన్ని సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఎంపీడీవోల ఖాతాలకు జమచేయడం జరిగిందని, పనులు చేసిన వారు వారిని సంప్రదించాలని జడ్పీ సీఈవో తెలిపారు.



అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి: టీడీపీ


మీడియా సమావేశంలో అరుణ,సీఆర్ రాజన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని పార్టీలకతీతంగా కఠినంగా శిక్షించాలని టీడీపీ చిత్తూరు పార్లమెంటు తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ బాలికపై అత్యాచారానికి పాల్పడింది టీడీపీ వారని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిందన్నారు. నిందితులు వినాయక చవితి ఉత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించడానికి వచ్చినపుడు తీసుకున్న ఫొటోలను పెట్టి అసత్యప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించిందన్నారు. వైసీపీ నిర్వహించిన కార్యక్రమాల్లో నిందితులు చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ విజయానంద రెడ్డితో కలసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న ఫొటోలు బయటకు రావడంతో వారికి నోట మాట రాలేదన్నారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ పాల్గొన్నారు.బాలికపై అత్యాచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చుడా చైర్ పర్సన్ కటారి హేమలత, తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైపీ రాజేశ్వరి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కోరారు.



కేజీబీవీల్లో సీసీ కెమెరాలతో మరింత భద్రత

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో భద్రత పెంచనున్నట్లు ఏపీసీ వెంకటరమణ తెలిపారు. జిల్లాలోని ఎనిమిది కేజీబీవీల్లో నిఘా పెంచడానికి సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కూల్‌డ్రింక్ అనుకుని తాగితే విషమైంది

నాలుగేళ్ల బాలిక మృతి -అస్వస్థత పాలైన ఆమె సోదరుడు


మృతురాలు జయశ్రీ

పుంగనూరు రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్ అనుకుని తాగిన ద్రవం నాలుగేళ్ల బాలిక ప్రాణం తీసింది. పుంగనూరు పట్టణ సమీపంలోని కంపోస్టుయార్డు వద్ద నివాసమున్న సుబ్రహ్మణ్యం కుమారుడు సుభాష్(8), కుమార్తె జయశ్రీ(4) బుధవారం చెత్తలో పడివున్న ఓ బాటిల్‌ను కూల్‌డ్రింక్ అనుకుని తాగారు. కాసేపటికే జయశ్రీ, సుభాష్‌లు తీవ్ర అస్వస్థతకు గురవడంతో తల్లిదండ్రులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే జయశ్రీ మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. సుభాష్‌కు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

పుంగనూరు రూరల్, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పుంగనూరు మండలం కొత్తపేటకు చెందిన రేవంత్ మార్కెట్ యార్డు వద్ద గంజాయి విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకున్నారు. 1.50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.





పీహెచ్‌సీ వైద్యుల నిరసన



చిత్తూరు రూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండి వైఖరి వీడాలని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారి సమస్యలు పరిష్కరించాలని స్థానిక గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యాధి కారులు 25 ఏళ్లుగా టైమ్ బౌండ్ ప్రమోషన్లు లభించకపోవడంతో దారుణమన్నారు. పొరుగు రాష్ట్రాలన్నిటి లోనూ అమలవుతున్నా ఇక్కడ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇటీవల ఏపీవీ వీపీలో మూడు సంవత్సరాల అనుభవం ఉన్న సీఏఎస్‌లకు ప్రమోషన్లు ఇచ్చారన్నారు. అయితే 25 ఏళ్లుగా సేవలందిస్తున్న డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో పీహెచ్‌సీ వైద్యులు మాత్రం ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తూ సీఏఎస్‌గానే రిటైర్ అవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. అలాగే జీవో 99 ద్వారా ఇన్‌సర్వీస్ కోటా కేవలం 15 శాతం తగ్గించి, అది కూడా 6 విభాగాలకు మాత్రమే పరిమితం చేయడాన్ని ఖండిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శిరీషా, వైద్యాధికారులు మునికుమార్, చంద్రమహేష్, విజయలక్ష్మి, హరినాథ్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి



విజయపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో బస్సు ఢీకొని ఒక వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ మహేష్‌బాబు కథనం మేరకు.. నాగలాపురం నుంచి తిరుత్తణి వైపుగా వెళ్లుతున్న ఓ ప్రైవేటు బస్సు ఆమగుంట వద్ద బస్సుకోసం నిలబడి ఉన్న ఆమగుంటకు చెందిన రాజయ్య(80)ను ఢీకొంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో తిరుపతి రుయాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ధార్మిక, సామాజిక విలువలకు ప్రతీక విజయదశమి: ఎస్పీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):ధార్మిక, సామాజిక విలువలకు ప్రతీకగా విజయదశమి పండుగను ఎస్పీ తుషార్ డూడీ అభివర్ణించారు.జిల్లా ప్రజలకు, పోలీసు కుటుంబ సభ్యులకు ఆయన ఒక ప్రకటనలో పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచితనం విజయం సాధించడానికి గుర్తయిన విజయదశమి పర్వదినంలో కుటుంబ సభ్యులను గౌరవించడం, సాంప్రదాయాలను పాటించడం, సమాజంలో ఐక్యతను పెంపొందించడం వంటివి భాగాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని ఆకాంక్షించారు.

తిరుపతి వేదికగా 8, 9 తేదీల్లో సహకార జాతీయ సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సహకారరంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి ఈనెల 8, 9 తేదీల్లో తిరుపతిలోని హోటల్ తాజ్ వేదికగా జాతీయస్థాయి సదస్సు జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యమిచ్చే ఈ సదస్సుకు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్, అడిషనల్ చీఫ్ సెక్రటరీ సిద్ధార్థ్ జైన్‌తో పాటుసహకార శాఖ కార్యదర్శులు, సహకార సంఘ రిజిస్ట్రార్లు, కేంద్రం, వివిధ రాష్ట్రాల్లోని సహకార రంగాలకు చెందిన అధికారులు, ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ నెల 7న డెలిగేట్లు తిరుపతికి చేరుకోనున్నారు. ఈ సదస్సు కోసం కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు.





శిక్షణా కాలంలో పూర్తిగా ఉంటేనే పోస్టింగ్

● కొత్త ఉపాధ్యాయులకు విద్యాశాఖ సూచన

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ద్వారా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు శిక్షణా కాలంలో పూర్తిగా ఉంటేనే పోస్టింగ్ ఆర్డర్స్ ఇస్తామని డీఈవో వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు చిత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో నిర్ణయించిన కేంద్రాల్లో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లుతెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు అభ్యర్థులు తప్పనిసరిగా వారి కేటాయించిన శిక్షణా కేంద్రాల్లో హాజరు కావాలని స్పష్టంచేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అపాంట్‌మెంట్ ఆర్డర్‌తో పాటు లేటెస్టు అండ్రాయిడ్ ఫోన్ తీసుకురావాలని సూచించారు.

నౌకా నిర్మాణ కేంద్రానికి స్థల పరిశీలన

వాకాడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లా వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించనున్న నౌకా నిర్మాణ కేంద్రానికి అవసరమైన భూములను సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన ఆధ్వర్యంలో కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటు చేయనున్న భూముల మ్యాప్‌ను పరిశీలించారు. పూర్తి వివరాలతో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నట్లు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్, డిప్యూటీ తహసీల్దారు రఫీ సయ్యద్, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రీవెన్స్ అర్జీలను త్వరగా పరిష్కరిస్తాం

చిత్తూరు రూరల్: విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌డేలో సమర్పించిన అర్జీలను త్వరగా పరిష్కరిస్తామని ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అన్నారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్తు శాఖ గ్రీవెన్స్ డే నిర్వహించారు. వినతులు స్వీకరించారు.



కారుణ్య నియామకం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన హెడ్‌గార్డ్ సురేంద్రబాబు భార్య ఆర్తికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇచ్చారు. బుధవారం ఎస్పీ తుషార్ డూడీ నియామక ఉత్తర్వును అందించారు. వారి పిల్లలకు హోంగార్డ్ బెనిఫిట్ ఫండ్ నుంచి రూ.3.50 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, ఎంటీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడమే తెలుసు: గురజాల

చిత్తూరు అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సేవ చేయడమే తనకు తెలుసని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. మూడు నెలలకు ముందు 40, 41వ డివిజన్లలోని రజకులు ఇస్త్రీ పెట్టెలు, తోపుడు బండ్లు కావాలని కోరగా ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆ మేరకు బుధవారం తోటపాళ్యంలో 25 మంది రజకులకు ఇస్త్రీ పెట్టెలు, తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన మాట ప్రకారం దసరాకు ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ. 15వేలు ఇస్తామన్నారు. నీవానదికి ఇరువైపులా ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నగర టీడీపీ అధ్యక్షులు నరేష్ పాల్గొన్నారు.

పుష్పపల్లకిలో విజయలక్ష్మిగా ఊరేగిన దుర్గమ్మ

చిత్తూరు సిటీ, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరింపేటలో కొలువైన దుర్గాంబ గురువారం పుష్పపల్లకిలో విజయలక్ష్మిగా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పాలక మండలి చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కట్టమంచి సాయికృపా అపార్ట్‌మెంట్‌లోని సాయిబాబా ఆలయంలో రాజరాజేశ్వరి అలంకారంలో, పొన్నియమ్మ గుడివీధిలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో రంగనాథ స్వామి విశ్వరూపం, రాముల వారి గుడివీధిలోని కోదండరామస్వామి ఆలయంలో బలరామావతారం, తేనెబండలోని ముత్యాలమ్మ పవళింపుసేవలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

ఐరాల(కాణిపాకం): శరన్నవ రాత్రుల్లో భాగంగా కాణిపాకంలో మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు బుధవారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. మణికంఠేశ్వర ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా అనుగ్రహించారు.

వెదురుకుప్పం: డీఆర్ఎన్‌కండ్రిగలో కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి, కార్వేటినగరం మండలం డేరాకండ్రిగలో నైనేరమ్మ మహిషాసుర మర్దినిగా భక్తులను కటాక్షించారు.

విజయపురం: విజయపురం మిట్టూరులో మహిషాసురమర్ధిని అలంకరణలో కనకదుర్గమ్మ భక్తులను అనుగ్రహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నగరి: పట్టణ పరిధిలో కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలోని కామాక్షిదేవి మహిషాసుర మర్దిని అలంకరణ చేశారు. బైపాస్ కూడలిలోని ఓం శక్తి ఆలయంలో అన్నదానం చేశారు. మాంగాడు అలిమేలుమంగకు విశేషపూజలు చేశారు.

బంగారుపాళ్యం: బంగారుపాళ్యం గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉభయదారులుగా ఉషాశ్రీ, మురళీ మోహన్, రేవతి, గాంధీ, తులసీరామ్, బిందు, త్రివేణీ, గిరిబాబు వ్యవహరించారు.


కాణిపాకంలో దుర్గాదేవిగా, డీఆర్ఎన్‌కండ్రిగలో మహిషాసుర మర్ధినిగా రాజరాజేశ్వరిదేవి

భక్తిశ్రద్ధలతో రథోత్సవం

గంగాధర నెల్లూరు, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): వేపంజేరి నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా సాగింది. అలాగే అశ్వ వాహనంపై లక్ష్మీనారాయణులు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం ఏడీఎంకే తాలుకా తలైవర్ శివగామినాదన్ ఆధ్వర్యంలో 10 మంది భజనబృందం సభ్యులు భక్తి పాటలను ఆలపించారు. హోమం, పూజలు, ఊంజల్ సేవ వైభవంగా జరిపించారు. వాహనసేవలకు హైదరాబాద్‌కు చెందిన వెంకటేష్‌స్వామి, చిత్తూరుకు చెందిన పద్మ ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ కె.ఎస్.వాసు, మాజీ ట్రస్టీ సతీమణి సుమిత్రాశ్రీధర్, మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.


లక్ష్మీనారాయణస్వామి

అమ్మవారి సేవలో థామస్

శ్రీరంగరాజపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలంలోని గంగమ్మగుడి ఆలయంలో జరుగుతున్న శరన్నవ రాత్రి ఉత్సవాల్లో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, ఏఎంసీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం పీహెచ్‌సీ తనిఖీ

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలోనే కాన్పులు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి అన్నారు. బుధవారం ఆమె కాణిపాకం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరు నమోదు, ఆరోగ్య సేవల రికార్డులను పరిశీలించారు. డాక్టర్లు రాజేంద్రప్రసాద్, స్వాతి సింధూర,రాజేశ్వరి, ఆరోగ్య విస్తరణాధికారి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ

యాదమరి: కీనాటంపల్లి పంచాయతీలోని షికారికాలనీలో నివసిస్తున్న 10 పేదకుటుంబాలకు జేసీ విద్యాధరి తన సొంత నిధులతో 10 కుటుంబాలకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. సిలిండర్లతో పాటు 10 మందికి ఇంటి పట్టాలు, స్థలాలు కొలతలు మార్కింగ్ చేశారు. తహసీల్దార్ పార్థసారధి సిలిండర్లు అందించారు. ఆర్ఐ ప్రసాద్, టీడీపీ అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ నాయుడు, ఎస్సీ ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మురుగేషన్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల మంజూరు: థామస్

పాలసముద్రం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండలాలలో పరిశ్రమలను ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం.థామస్ పేర్కొన్నారు. బుధవారం వనదుర్గాపురంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎంపీ దగ్గుమళ్లప్రసాదరావుతో కలసి ఆయన ప్రారంభించారు. ఎస్టీ కాలనీలో ఇంటింటికీ తిరిగి పింఛన్లను పంపిణీ చేశారు. జీఎస్టీ సంస్కరణలతో మహిళా సాధికరతపై నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పాలసముద్రం మండలానికి బాలుర గురుకుల పాఠశాల మంజూరైందన్నారు. మండలంలో 74 సీసీ రోడ్లకు గాను రూ.9 కోట్లు మంజూరయ్యాయన్నారు. తిరుమలరాజుపురానికి పీహెచ్‌సీ మంజూరైందన్నారు. పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమనాయుడు, వైస్ చైర్మన్ అరుళ్ నాథన్, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో షతీష్, ఎంఈవో రాజేంద్రప్రసాద్, నాయకులు శేఖర్‌రాజు, జనార్దన్‌రాజు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలోని 24వ వార్డులోని శంకరయ్యగుంట, 25వ వార్డులోని బాలాజీ నగర్‌కాలనీలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, కమిషనర్ నరసింహప్రసాద్, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు శిలా ఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యే థామస్

జీఎస్టీపై పూతలపట్టులో ర్యాలీ

పూతలపట్టు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలపై పూతలపట్టులో బుధవారం ఉదయం అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గడంతో నిత్యావసర ధరలు తగ్గాయన్నారు. అనంతరం రామాపురం రోడ్డులో లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, జడ్పీటీసీ దేవిక, ఎంపీపీ కుమారి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, నాయకులు ప్రతాపనేని చంద్రమౌళి, గుంటూరు మురళి, పాల్గొన్నారు.


జీఎస్టీపై దుకాణదారుకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

కారు, లారీ ఢీ .. ముగ్గురికి గాయాలు

యాదమరి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంతగేటు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పూతలపట్టు మండలం బండపల్లెకు చెందిన వినోద్, నరేష్, భీమేష్, డ్రైవర్ రమేష్‌తో కలిసి కారులో మంగళవారం ఉదయం తమిళనాడులోని గుడియాత్తం వెళ్లారు. తిరిగి వస్తుండగా సంతగేటు వద్ద ముందు వెళుతున్న లారీని వెనుకవైపు నుంచి ఢీకొన్నారు. కారులోని డ్రైవర్ రమేష్, భీమేష్, వినోద్ గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

రక్తదానం చేయండి..హీరోగా నిలవండి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి సమాజంలో నిజమైన హీరోగా నిలవాలని ఎస్పీ తుషార్ డూడీ కోరారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం సీఎంసీ క్యాంపస్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. రక్తదానం చేసిన వారిని సన్మానించారు. సీఎంసీ ఆస్పత్రి అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ జకారియా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అలెక్స్, బ్లడ్‌బ్యాంక్ హెడ్ డాక్టర్ డాలీ, ప్రిన్సిపాల్ నిర్మల మార్గరెట్ పాల్గొన్నారు.

అనాథల ఆకలి తీరుస్తున్న అన్నసూక్తం


బంగారుపాళ్యం,అక్టోబర్ 1(ఆంధ్రజ్యోతి): అనాథల ఆకలి తీరుస్తున్న అన్నసూక్తం కార్యక్రమం ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద హండ్రెడ్ డీమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1కే అనాథలకు అన్నం పెడుతున్న సూక్తం వార్షికోత్సవానికి ఎమ్మెల్యే మురళీ మోహన్ హాజరయ్యారు. అన్నసూక్తం స్టాల్‌ను ప్రారంభించారు. పేదలకు అన్నదానం చేశారు. హండ్రెడ్ డ్రీమ్స్ ఫౌండేషన్ స్థాపకుడు మురళీకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ ఫౌండేషన్ కార్యనిర్వాహకులు లోకేష్ పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

గుడిపాల: జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, జిల్లా బీజేపీ నాయకుడు చిట్టిబాబు బుధవారం కిలారిపల్లె, కుప్పుగానిపల్లె గ్రామాలలో పార్టీ జెండా ఆవిష్కరించారు.











బోయకొండలో వైభవంగా దసరా ఉత్సవాలు



ప్రత్యేక అలంకారంలో మూలస్థానం అమ్మవారు



శ్రీనివాస కల్యాణఘట్టం అలంకరణలో వెంకటరమణస్వామి

చౌడేపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో బుధవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మహా గణపతి, నవగ్రహ, దుర్గ చండీ, మృత్యుంజయేశ్వర హోమాలు నిర్వహించారు. ఉభయదారులకు ఆలయ ఈవో ఏకాంబరం అమ్మవారి శేష వస్త్రాలు, అమ్మవారి ఫొటో, తీర్థప్రసాదాలను అందించారు. అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

● గుడుపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మండలంలోని రైల్వే క్రాస్‌లో సమీపంలో కొలువైన రాళ్లగంగమాంబ మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

● పుంగనూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన టీటీడీకి చెందిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీనివాస కల్యాణం ఘట్టం సన్నివేశంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలంకరించి పూజలు చేశారు.

ధనలక్ష్మీదేవి అలంకరణలో పార్వతీదేవి



చౌడేపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టదమృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో వెలసిన పార్వతిదేవి ధనలక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



గంగవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూడిదపల్లెలో ప్రభుత్వ స్థలం ఆక్రమించుకున్నారని.. ఓ దళిత కుటుంబానికి చెందిన షెడ్డు కూల్చేసిన అధికారులు.. తాగునీటి సరఫరా లేకుండా తొలగించారని బుధవారం కేవీపీయస్ ఆధ్వర్యంలో గంగవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీయస్ నాయకులు ఓబులరాజు, ఈశ్వర్ మాట్లాడుతూ నిరుపేదరాలు అయిన మునెమ్మ సుమారు 20 ఏళ్లుగా ఉన్న స్థలంలో షెడ్డును నేలమట్టం చేశారని, అదే గ్రామంలో ప్రభుత్వ స్థలాలు, డీకేటీ భూములను ఆక్రమించుకొని దర్జాగా ఉంటే వారిని ఎందుకు పట్టించుకోలేదో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. అధికారులు పేదలకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. నాయకులు సుబ్రహ్మణ్యం, నరసింహులు, మునిరత్నం, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

చౌడేపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. దిగువపల్లె పంచాయతీ కొలింపల్లెకు చెందిన జయరాం కుమారుడు సునీల్(30) బోయకొండలో వ్యాపారం చేసుకుంటున్నాడు. బోయకొండ క్రాస్ వద్ద నుంచి కొండ కిందకు ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని స్థానికులు ఆటోలో మదనపల్లె ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు.



ఎస్.గొల్లపల్లె అటవీ ప్రాంతంలో ఏనుగుల మకాం

రామకుప్పం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఎస్ గొల్లపల్లె సమీప అటవీ ప్రాంతంలో ఉప్పువంక చెరువు వద్ద ఆరు ఏనుగులు సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. గిల్లపల్లె, పంద్యాలమడుగు, ననియాల, జీడీమాకులపల్లె, రామకుప్పం తాండా, ననియాల తాండా, నారాయణపురవ తాండా గ్రామాల వైపుగా వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అటవీ సమీప గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏనుగులు వచ్చినట్లు తెలిస్తే వెంటనే ఫోన్‌నంబర్లు 6301667521, 9966238653 లను సంప్రదించాలని కోరారు.







కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకుల ఫిర్యాదు

కల్లూరు, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలానికి చెందిన ఓ వ్యక్తి టీడీపీ నాయకులు, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించాడంటూ బుధవారం కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ ఫిర్యాదు చేశారు. మండలంలోని రేణుమాకులపల్లికి చెందిన వెంకటేష్ టీడీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చకొడుతూ భయభ్రాంతులకు గురి చేసేలా ఓ వీడియోను అంతర్జాలంలో పోస్టు చేసినట్లు ఫిర్యాదులో తెలిపారు. అతడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లను కోరారు. వీరి వెంట టీడీపీ నాయకులు మోహన్‌దాస్, బారు, అబ్బాస్, బాబు, సుబ్రహ్మణ్యంనాయుడు, ఖాదర్‌వల్లి పాల్గొన్నారు.





క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి


వాలీబాల్ క్రీడలను ప్రారంభిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరులో బుధవారం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అసహాయులకు ఆసరా.. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వృద్ధులు, వికలాంగులు, వితంతువుల వంటి అసహాయులకు ఆసరా అని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలకక సంఘం 10వ క్లస్టర్ పరిధిలో ఆయన బుధవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి సోమశేఖర్, కౌన్సిలర్ జీమ్‌దాము, నాయకులు జాకీర్, ఆర్ఆర్.రవి, మంజునాథ్, నాను, నరేశ్, ఉమర్, కాసిం, బాలు, జహీర్, రాజేంద్ర ప్రసాద్, ముజీబ్, గీత తదితరులు పాల్గొన్నారు.

● కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 23, 24 వార్డుల్లో కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ 162వ బూత్ ఇన్‌చార్జి భరత్, గోవిందరాజు పాల్గొన్నారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం మండలంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. బైరెడ్డిపల్లె బాటగంగమ్మ ఆలయం, సల్లాపురెమ్మ ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, గడ్డూరు సల్లాపురెమ్మ ఆలయం, కొత్రేపల్లె ధనకొండ గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానాలు చేపట్టారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు నిజమైన దసరా


ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు


పలమనేరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కుప్పం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యంత్రాలు, పరికరాలపై కూటమి ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో రైతులకు నిజమైన దసరా పండుగ వచ్చిందని వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలోని మండల సచివాలయంలో బుధవారం వ్యవసాయశాఖ తరఫున జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అంశంపై రైతులతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా, వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల అధికారులు మాట్లాడుతూ తగ్గించిన జీఎస్టీ వల్ల తగ్గిన వ్యవసాయ పరికరాల ధరలు, సబ్సిడీల వివరాలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మునిరాజు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్ఎస్.తులసీనాథ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, సింగిల్ విండో చైర్మన్ కృష్ణమూర్తి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరు మండల రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం రైతులకు జీఎస్టీపై డీఎల్‌డీవో రామచంద్ర, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ పరికరాలను ప్రదర్శించారు. ఎంపీడీవో వినోద్, ఏవో సంధ్య, ఎంపీపీ రోజా, పశుసంవర్ధక శాఖ అధికారులు సతీష్‌కుమార్, ధనంజయరెడ్డి, పట్టుపరిశ్రమ శాఖ ఏడీ సరోజ, సింగిల్‌విండో అధ్యక్షులు పెద్దబ్బ, వెంకటమునిరెడ్డి, ఏపీవో కృష్ణ, టీడీపీ నాయకులు నాగరాజరెడ్డి, జగదీష్‌నాయుడు, దేవరాజులునాయుడు, బాబునాయుడు, స్వతంత్రబాబు, ఏఈవో కుమారనాయుడు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు విధానాన్ని తీసుకురావడంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం సూపర్ జీఎస్టీ. సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఆనందబాబు, వ్యవసాయాధికారిణి గీత, సింగిల్‌విండో చైర్మన్ నాగరాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘుచంద్రగుప్తా, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పదవులున్నా.. లేకపోయినా ప్రజా సేవలోనే!

కుప్పం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పదవులున్నా, లేకున్నా టీడీపీ నాయకులు ఎప్పుడూ ప్రజా సేవలో గడుపుతారని ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. కుప్పం మండలం మల్లానూరు దళిత వాడలో ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న పార్వతి అనే మహిళను బుధవారం ఆయన పరామర్శించారు. అలాగే తన సొంత బూత్ 234 పరిధిలో సామాజిక పింఛన్లు పంపిణీ చేసి లబ్ధిదారుల కష్టసుఖాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక బూత్, యూనిట్ ఇన్‌చార్జిలు నాగార్జున, దామోదర్, సింగిల్ విండో డైరెక్టర్ అన్నాదొరై, పంచాయతీ కార్యదర్శి రమ్యలత తదితరులు పాల్గొన్నారు.







పీకేఎం చైర్మన్‌కు సన్మానం

పలమనేరు, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు టీడీపీ కార్యాలయంలో బుధవారం పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబును టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పీకేఎం ఉడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా డాక్టర్ సురేష్‌బాబు పలమనేరు టీడీపీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువ, పూలమాలలతో సన్మానించారు. ఈనెల 6న కుప్పంలో ప్రమాణ స్వీకారానికి అందరూ హాజరు కావాలని ఆయన కోరారు. టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంగౌడు, బ్రహ్మయ్య, ఖాజాపీర్, నాగరాజు, మదన్‌మోహన్, శ్రీధర్, బీఆర్‌సీ కుమార్, టీడీపీ నాయకులు నాగరాజరెడ్డి, పెద్దబ్బ, జగదీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూల రైతులకు మంచి రోజులు

కుప్పం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో కుప్పం పూల రైతులకు మంచి రోజులు వచ్చాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మునిరాజు అన్నారు. కుప్పం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద మంగళవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో పూల రైతులను పరామర్శించారు. దసరా సందర్భంగా పూల ధరలు పెరిగినందున కేవలం కుప్పం నియోజకవర్గం నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోని సరిహద్దు గ్రామాల నుంచి పూల రైతులు ఆర్టీసీ బస్టాండుకు తమ పంటను విక్రయించుకునేందుకు తెచ్చారు. వారితో చైర్మన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దళారీ వ్యవస్థతో రైతులను దోచుకుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దళారీ వ్యవస్థ రద్దు చేశామన్నారు. అలాగే గేట్ ఫీజు రద్దు చేయడమే కాకుండా, రూపాయి కమిషన్ లేకుండా రైతులు పూలను విక్రయించి లాభాలు సొంతం చేసుకుని బాగుపడుతున్నారని గుర్తు చేశారు.

రోడ్డు విస్తరణతో ప్రమాదాల నివారణ

కుప్పం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా ప్రమాదాల నివారణకు మార్గం సుగమమవుతుందని కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ అన్నారు. టీడీపీ కార్యాలయం సమీపంలో బైపాస్ ఓవర్ బ్రిడ్జి ప్రారంభంలో ప్యాలస్ లింక్ రోడ్డు కలిసే కూడలిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతం నుంచి కడా కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ కోసం సంబంధిత అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్ పాల్గొన్నారు.







